అనంత సూర్య
తెలుగువార్త
ఆదివారం 23 ఆగస్టు 2026

మొదటి పేజీ తరువాయి

## జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు.. తెలంగాణకు ప్రయోజనం

ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపి వేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ప్లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి ఆయన విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నేటి (ఆగస్టు 22) నుంచి రామగుండం ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

## ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్ష

వెంగల్‌రావునగర్‌లోని ఔలో అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లతో మంత్రి సమావేశమయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది పనితీరు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడటం, వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. జిల్లాల వారీగా ఆసుపత్రుల పరిస్థితి, అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై మరింత నమ్మకం కలిగేలా ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. డీఎంకే సంచలన నిర్ణయాలు..!

కొత్త ఉత్సాహం నింపుతాయని భావిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్లుగా నిర్ణయించారు. మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శుల వయసు 50 ఏళ్లకు మించకూడదు. టౌన్ పంచాయతీ పార్టీ కార్యదర్శులు, ఏరియా కమిటీ కార్యదర్శులు, సిటీ కమిటీ కార్యదర్శులకు గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. జిల్లా పార్టీ కార్యదర్శుల పదవికి అత్యధికంగా 70 ఏళ్ల వరకు వయోపరిమితి విధించారు. ఈ పదవుల్లో ఎన్నికైన వారు గరిష్ఠంగా రెండు టర్మ్ లు మాత్రమే కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పార్టీ పదవుల్లో కొత్తవారికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. స్థానిక సంస్థాగత విభాగాల నిర్మాణంలోనూ డీఎంకే మార్పులు చేసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఒక్కో ఏరియా కమిటీ పరిధిలో సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా నిర్ణయించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సంఖ్యను 30 వేలుగా నిర్ణయించారు. సిటీ కమిటీల పరిధిలో కూడా సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా తీర్మానం చేశారు. ఈ మార్పులను డీఎంకే ఎంపీ పి. విల్సన్ స్వాగతించారు. ఇవి పార్టీ సంస్థాగత వ్యవస్థలో మంచి నిర్మాణాత్మక సంస్కరణలని, అందరికీ మేలు చేసే నిర్ణయాలని ఆయన పేర్కొన్నారు.

## కొత్త సుంకాలతో అమెరికా కెనడా మధ్య ముదిరిన వాణిజ్య ఉద్రిక్తత

కొత్త నిబంధనలు అన్యాయంగా, ఆర్థికపరంగా అసంబద్ధంగా ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా ఒప్పందం విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతాయని కార్నీ పేర్కొన్నారు. సుమారు 28 బిలియన్ డాలర్ల విలువైన కెనడియన్ వస్తువులపై 50 శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా ప్రకటించింది. కెనడియన్ కార్మికులు, వ్యాపారాల ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం కూడా సమాన స్థాయిలో ప్రతీకార సుంకాలు విధిస్తుందని కార్నీ స్పష్టం చేశారు. అయితే చర్చలు విఫలం కావడానికి కెనడానే కారణమని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ఆరోపించింది. వారంలో ప్రారంభంలో అంగీకరించిన నిబంధనల ప్రకారం ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఒట్టావా నిరాకరించిందని పేర్కొంది. అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే ప్రధాన దేశాలకు అందించే అత్యుత్తమ వాణిజ్య ప్రాధాన్యతను కెనడాకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. కెనడా కొత్త డిమాండ్లు చేయడం, గతంలో చేసిన కొన్ని కట్టుబాట్ల నుంచి వెనక్కి తగ్గడం చర్చలపై ప్రభావం చూపాయని అమెరికా తెలిపింది. అమెరికా ప్రతిపాదించిన ప్యాకేజీలో ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్, కలపపై సుంకాలను గణనీయంగా తగ్గించే అంశాలు ఉన్నాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం వెల్లడించింది. ఎగుమతి నియంత్రణలు, ట్రాన్స్‌షిప్‌మెంట్, డిజిటల్ వాణిజ్యం, కీలక ఖనిజాలు, బలవంతపు కార్మికులతో తయారైన వస్తువుల దిగుమతులపై ఇరు దేశాల మధ్య సహకారం కూడా ప్రతిపాదనలో ఉన్నట్లు తెలిపింది. అదే విధంగా ఏరోస్పేస్ రంగంలో సరఫరా గొలుసు సమన్వయం, యునైటెడ్ స్టేట్స్-మెక్సికో-కెనడా ఒప్పందం (ఖూవీజూా)పై అధికారిక చర్చలకు సంబంధించిన ప్రకటన కూడా ఈ ప్యాకేజీలో భాగంగా ఉండేదని అమెరికా పేర్కొంది. అమెరికాతో భాగస్వామ్యం చేసుకునే అవకాశాన్ని కెనడా కోల్పోయిందని అమెరికా వాణిజ్య ప్రతినిధి విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధానమంత్రి కార్నీ.. తమ దేశం చాలా కెనడియన్ వ్యాపారాలకు సుంకాల రహిత అమెరికా మార్కెట్ ప్రవేశం, ద్వైపాక్షిక వాణిజ్యంలో స్థిరత్వం, వ్యూహాత్మక పరిశ్రమలపై సుంకాల తగ్గింపును కోరిందని తెలిపారు. అదే సమయంలో కెనడా తన ఆర్థిక స్వాతంత్ర్యం, విధానపరమైన సౌలభ్యాన్ని కొనసాగిస్తూ చిన్న, మధ్య తరహా వ్యాపారాలను రక్షించుకోవాలని భావించిందని చెప్పారు. అమెరికాతో గతంలో ఉన్న సంబంధాలు ఇకపై యథాతథంగా ఉండవని కెనడా గుర్తించిందని కార్నీ అన్నారు. ఏదైనా గడువులోపు ఒప్పందం కుదుర్చుకోవడం కంటే.. కెనడియన్ల ప్రయోజనాలను కాపాడే ఉత్తమ ఒప్పందాన్ని సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కెనడియన్ కార్మికులు, వ్యాపారాలకు అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. గత 18 నెలల్లో అందించిన దాదాపు 25 బిలియన్ డాలర్ల మద్దతుకు ఇది అదనంగా ఉంటుందని చెప్పారు. తాజా సుంకాలపై అమెరికాలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వెర్మాంట్‌కు చెందిన డెమొక్రటిక్ సెనేటర్, సెనేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు పీటర్ వెల్చ్.. కెనడియన్ వస్తువులపై కొత్తగా విధించనున్న 50 శాతం సుంకాలను ఉపసంహరించుకోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరారు. ఈ సుంకాలు అమెరికా వ్యాపారాలు, రైతులు, కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆయన అన్నారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య విధానంపై కాంగ్రెస్ పాత్రను పెంచే ప్రతిపాదనలకు కూడా వెల్చ్ మద్దతు ఇస్తున్నారు. కెనడాపై విధించే సుంకాల నుంచి అమెరికా యాజమాన్యంలోని చిన్న వ్యాపారాలకు మినహాయింపు కల్పించే చట్టానికి ఆయన ప్రధాన స్పాన్సర్‌గా ఉన్నారు. ఇప్పటికే ఆటోమొబైల్స్, లోహాలు, అటవీ ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలు కెనడా ప్రతీకార చర్యలకు దారితీశాయి. కెనడా 51వ అమెరికా రాష్ట్రంగా మారుతుందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా ఇరు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలను పెంచాయి. తాజా సుంకాల నేపథ్యంలో అమెరికాపై ఆర్థిక ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న డిమాండ్లు కెనడాలో మరింత బలపడే అవకాశం కనిపిస్తోంది.

## త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తాం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రమంతా చెత్తమయం చేశారని ప్రస్తుతం ఆ చెత్తను తొలగించే పనులు ఊపందుకున్నాయన్నారు. స్వచ్ఛత మనందరి బాధ్యత: చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథాలను పంపుతున్నామన్నారు. ఇంట్లోని చెత్త ఇస్తే బదులుగా మరొకటి ఇస్తారన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదని స్వచ్ఛమైన ప్రాంతాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కోసం ఆలోచించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ముందుకొస్తున్న ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. మన ఊరు - మన బాధ్యత సంకల్పం అందరూ తీసుకోవాలన్నారు. మన ఇల్లు, వీధి, కార్యాలయం, బహిరంగ ప్రదేశాలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛత మరింత అవసరం సీఎం చంద్రబాబు అన్నారు. అనకాపల్లికి గోదావరి నీళ్లు: త్వరలోనే



అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువు, రిజర్వాయర్ నింపే బాధ్యత తమదని, సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటర్ మన దేశానికి వస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రావడం గర్వంగా భావిస్తున్నామన్నారు. ఇంటిపై సోలార్ ప్యానెల్ పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు ఉండదని సూచించారు. ఆడబిడ్డల కోసం 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో 3 గ్యాస్ సిలిండర్ల డబ్బులు 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని వివరించారు. 2047కు మోదీ నాయకత్వంలో దేశం అగ్రదేశంగా వికసిత్ భారత్ వెలుగొందుతుందన్నారు. 2047కు తలసరి ఆదాయం రూ.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. 'డేటా సెంటర్ వస్తే లక్షల మందికి మంచి ఉద్యోగాలు వస్తాయి. ఆదాయం కూడా ఆకాశమే హద్దుగా ఉండబోతుంది. మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. గూగుల్ డేటా సెంటర్ కోసం సుందరమైన విశాఖకు వచ్చారని వేరే రాష్ట్రాలు ఆశ్చర్యపోతే ఇక్కడుండే వాళ్లు కొద్దిమంది జెండాలు పట్టుకుంటారన్నారు. ఇంతవరకూ డేటా సెంటర్ ప్రారంభం కాలేదు అప్పుడే నీళ్లు ఇంకిపోయాయంటారు. తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం ప్రారంభించారు.'

## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి

అమరావతి : సమాజంలో మనం కోరుకున్న సమూల మార్పులు ఒక్క విద్యతోనే సాధ్యమవుతాయని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే తాను కీలకమైన విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. విజయనగరం జిల్లా దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలను లోకేశ్ వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాను కూడా విద్యాశాఖ సమర్థ నిర్వహణకు ఏఐపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 10,000 పాఠశాలల్లో 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని వెల్లడించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే చదువుకుంటారు. వారిపై ఉపాధ్యాయులు మరింత ఆప్యాయత, శ్రద్ధ చూపాలి. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించి ముందుకు నడిపించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. నేటి సమాజంలో విద్యార్థుల్లో పెరుగుతున్న చెడు వ్యసనాలను కట్టడి చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. అదేవిధంగా ఈ సమస్య పరిష్కారానికి 'ఈగల్ క్లబ్' కీలక పాత్ర పోషిస్తుంది.ఇటీవల విశాఖలో ఓ విద్యార్థి మృతిచెందడం ఎంతో బాధాకరమని' లోకేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా పలువురు ఉపాధ్యాయులతో లోకేశ్ నేరుగా మాట్లాడారు. బోధనలో వారు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలు, సూచనలను స్వీకరించారు. విద్యావ్యవస్థ మెరుగుదల కోసం ప్రతి నెలా ఈ క్లస్టర్ సమావేశంలో తాను స్వయంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు. లోపాలను సరి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. అంతకుముందు, విజయనగరం వై జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేశ్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మరియు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. డప్పుల దరువులతో,




వివిధ రకాల జానపద కళారూపాలతో ఆయనకు స్వాగతం పలికారు. లోకేశ్ ను చూసేందుకు విజయనగరానికి చెందిన మోహన్ రావు అనే ఓ టీడీపీ కార్యకర్త సైకిల్ పై వచ్చాడు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గర్ల్స్ స్కూల్ వద్ద లోకేశ్ తో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.

## నోరు తెరిస్తే అబద్ధాలు.. అడుగు వేస్తే అరాచకం: జగన్ పై మంత్రి పార్థసారథి ఫైర్

మొదటి పేజీ తరువాయి

అమరావతి : వైసీపీ అధ్యక్షుడు జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు, అడుగు వేస్తే అరాచకం తప్ప మరొకటి ఉండదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించిన ఘోరాలను కప్పిపుచ్చుకోవడానికే, నేడు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న మెగా డీఎస్సీపై జగన్, ఆయన పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 కుంభకోణంపై హైకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా అని మంత్రి సవాల్ విసిరారు. "నాడు గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించినట్లే, నేడు ఏపీపీఎస్సీ స్కామ్‌ను కప్పిపుచ్చుకోవడానికి మెగా డీఎస్సీపై బురదజల్లడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీపై వైసీపీ నేతలు 300 కేసులు వేయగా, వాటి వెనుక కుట్ర



ఉందని న్యాయస్థానమే అభిప్రాయపడింది" అని పార్థసారథి గుర్తుచేశారు. వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్-1 పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో కాకుండా, ప్రైవేట్ రిసార్టుకు తరలించి తమకు అనుకూలమైన వారితో మూల్యాంకనం చేయించారని మంత్రి ఆరోపించారు. "ప్లంబర్లు, కార్పెంటర్లు, రోజువారీ కూలీలు, పరీక్ష రాసిన వారి కుటుంబ సభ్యులతోనే పేపర్లు దిద్దించినట్లు సిట్ నివేదికలోనే బట్టబయలైంది. జవాబు పత్రాల్లో విచ్చలవిడిగా వైట్నర్ వాడటం, డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లు సృష్టించడం ద్వారా అర్హులైన పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎఫ్ఎస్ఎల్ ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 95 శాతం మంది పేపర్లలో తీవ్ర అవకతవకలు జరిగాయని, 89 పత్రాల్లో ఎగ్జామినర్ సంతకాలు కూడా సరిపోలలేదని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంతోనే 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని పార్థసారథి తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించి ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తూ, ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఐదేళ్లలో చేసిన పాపాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే 11 మంది ఎమ్మెల్యేలున్నా జగన్ అసెంబ్లీకి రాకుండా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. నాడు ఒక్కరైనా లోక్ సత్తా జయప్రకాశ్ నారాయణ, బీజేపీ కిషన్ రెడ్డి అసెంబ్లీలో ఒంటరి పోరాటం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయకత్వంలో యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

న్యాయసేతు అనేది ఒక వారధి : సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

"చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా దిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

**- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'**

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

**- ఎస్.ఎస్. నాగానంద్**

**భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు**

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.

## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు'- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది. ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు. "2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న



నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది."

**నితిన్ నబీన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు**

కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జబెజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జబెజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా? ఏ కుటుంబం, ఏ రాజకీయ పార్టీ, ఏ వ్యక్తి కూడా దేశ చట్టం, దేశ రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే తాము గొప్పవారమని భావించకూడదు. జబెజ తన కార్యాలయంలో కూర్చుని, తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం. పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయమే దేశ నిర్ణయం. వందేమాతరం దేశ గేయం. అది దేశ మంత్రం. హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడానికి ఇది ఒక సాధనం కాదు. కాంగ్రెస్ విభజన బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. దీన్ని మేము జరగనివ్వము." అని సంబిత్ పాత్ర అన్నారు.

# మహిళా కార్మికులకు చీరల పంపిణీ




అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న పది మంది మహిళ పారిశుద్ధ్య కార్మికులకు చైర్పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ బెనెడిక్టా చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు రమణ, అరుణ దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ బెనెడిక్టా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య మహిళా కార్మికులకు నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ పుట్టినిల్లు ఆశ్రమ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో కార్మికులు మరింత ఉత్సాహంగా పని చేస్తారని శ్రావణమాసం సమయంలో మహిళలకు పసుపు, కుంకుమ ముత్తయిదువులకు కావలసిన వస్తువులను అందిస్తూ నిర్మలమురళి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిర్మలమురళి మాట్లాడుతూ.. శ్రావణమాసంలో మహిళలు ఎన్నో కోరికలతో ప్రత్యేక పూజలు చేస్తారని గుర్తు చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో మహిళలకు చీరలతో పాటు పసుపు, కుంకుమ, గాజులు మహిళలకు అందించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ట్రస్టు సభ్యులు పెళ్లిరోజుని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ట్రస్ట్ సభ్యులు రమణకు మహిళా కార్మికులంతా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ విజయ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా.. రక్తదానం




అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా శనివారం మెగా యత్ ఫోర్స్, అనంత ఆసరా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక దీపు బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెగా యత్ ఫోర్స్ జిల్లా కో కన్వీనర్ శేషాద్రి, వంశీ, లోకేష్, పీర్‌బాషా తదితరులు హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఏ ఒక్క ప్రాణం పోకూడదని భావించి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసిన మెగాస్టార్ చిరంజీవి ఎందరికో ప్రాణదాతగా నిలిచారన్నారు. అలాగే ఐ బ్యాంకు ద్వారా అనేక మందికి కంటిచూపును ప్రసాదించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తాము కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు శేషాద్రి తెలిపారు.

## ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, ఆగస్టు 22 :( అనంత సూర్య) : ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది.



ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాగ్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎం.ఎస్.ఎస్ మహిళా అధ్యక్షురాలుగా సుధ మహేశ్వరి



అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : మత్స్యకార సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా మత్స్యకార సంఘం మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక కోర్టు రోడ్డులోని శివకృప కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగముని, రాష్ట్ర కార్యదర్శి నారాయణ మూర్తి, రాష్ట్ర మహిళా కార్యదర్శి వనజ వాణి, జిల్లా ఇంచార్జి శివ కుమార్‌లు సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి (ఎం ఎస్ ఎస్) మహిళా అధ్యక్షురాలుగా సుధ మహేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా మేక నాగజ్యోతి, రూప, జిల్లా కార్యవర్గ సభ్యులుగా శివశంకరి, దేవరాజ్ సుజాత, విజయ, లక్ష్మీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు, మత్స్యకార ప్రతినిధులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు, సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా చూస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగముని, రాష్ట్ర మహిళా కార్యదర్శి వనజవాణి నూతనంగా ఎన్నికైన సభ్యులకు శాలువాతో సత్కరించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. తనపై నమ్మకంతో జిల్లా మహిళా అధ్యక్షురాలు పదవి అప్పగించినందుకు మహేశ్వరి మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కమిటి సభ్యులకు జిల్లా కమిటి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి నగర గౌరవాధ్యక్షులు బాలన్న, మాజీ జిల్లా అధ్యక్షులు గొడుగు నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త వెంకటేష్, జిల్లా ప్రచార కార్యదర్శి రామశేషు, మత్స్యకారా కమిటి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



ధర్మవరం,ఆగస్టు,22: (అనంత సూర్య): స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర (ూూూూ) కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ. స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం విద్యార్థులు భాగస్వాములు కావడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులను మరియు పెద్దలను కూడా ప్రేరేపించాలని సూచించారు. ఉపాధ్యాయులతో ముచ్చటించిన ఆయన, విద్యార్థులకు స్వచ్ఛతపై క్రమం తప్పకుండా అవగాహన మరియు మోటివేషన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో దాదాపు 20 మొక్కలను నాటారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రన్నింగ్ వాటర్ సదుపాయం ఉన్నప్పటికీ సరిగా నిర్వహించకపోవడంపై హెడ్ మాస్టర్ ను మందలించి, తక్షణమే మెరుగైన పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వంటగదిని పరిశీలించి ఆహార నాణ్యతను, శానిటేషన్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులతో కలిసి హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాల్గొని, చేతుల పరిశుభ్రత వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ధర్మవరం తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి

## ఎస్కే యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం వినతి



అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఎస్కే యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్‌కు సంఘం అధ్యక్షుడు ఎస్. చిన్న పెద్దన్న, కార్యదర్శి ఎస్. మారుతి, కోశాధికారి కె. ఆనంద్ వినతిపత్రం సమర్పించారు. 2017 మార్చి 31న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించి 73 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు వికలాంగుల పోస్టులను కలిపి ఒకే నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులకు ప్రత్యేకంగా, వికలాంగుల పోస్టులకు ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కోర్టు స్టేను తొలగించేలా చర్యలు తీసుకుని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. 1994లో జీఓ నంబర్ 333 ప్రకారం ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌కు సంబంధించిన మహానంది హాస్టల్ పోస్టులతో కలిపి 52 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అనంతరం 1997లో మరో 26 ఉద్యోగాలను భర్తీ చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల స్థానాలు, ఇతర కారణాలతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయలేదని తెలిపారు. విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా హాస్టల్, విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని సంఘం ప్రతినిధులు తెలిపారు. ప్రత్యేక నోటిఫికేషన్లు జారీ చేసి, కోర్టు స్టే సమస్యను పరిష్కరించి, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని వైస్‌చాన్సలర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం వైస్‌ప్రెసిడెంట్ శ్రీరాములు, జాయింట్ సెక్రటరీ బి. సంజీవప్ప, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బి. నారాయణప్ప, బి. ధర్మయ్య, బి. స్వాతి, బి. మంజునాథ్ నాయక్, హెచ్.సి. ఓబులేసు, ఎన్. అనిల్ కుమార్, సాయి కృష్ణ, ఎస్. శ్రీనివాసులు, బి. ముత్యాలప్ప, బి. లక్ష్మీదేవి, ఎం. గంగాధర, ఎస్. చదువు పెద్దన్న, ఇ. కుళ్లాయప్ప నాయక్, లక్ష్మీబాయి, హెచ్. శ్రీరాములు, హెచ్. వెంకటరాముడు, ఎస్. మరయ్య, దైవదీనం తదితరులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలతో మూతపడిన ఆర్ఎంపీ క్లినిక్‌లు మెడికల్ స్టోర్లు



నార్పల,ఆగస్టు 22 (అనంత సూర్య): మండలంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కట్ట వెంకటేశ్వర్లు చేపట్టిన ఆకస్మిక తనిఖీలు చర్చనీయాంశంగా మారాయి.నార్పల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స విధానం, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రోగుల పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.అనంతరం మండల కేంద్రంలో శ్రీ లలితా క్లినిక్‌ను డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. క్లినిక్ నిర్వహణ, అనుమతులు, రికార్డులను పరిశీలించిన అనంతరం క్లినిక్ వైద్యుడు రామచంద్రకు నోటీసులు జారీ చేశారు. వైద్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ కట్ట వెంకటేశ్వర్లు తెలిపారు.ఇదిలా ఉండగా డీఎంహెచ్ఓ నార్పలకు వస్తున్నారనే సమాచారం ముందుగానే బయటకు వెళ్లినట్లు మండలంలో జోరుగా చర్చ సాగుతోంది. తనిఖీల సమాచారం అందగానే మండల వ్యాప్తంగా పలువురు ఆర్ఎంపీ వైద్యులు తమ క్లినిక్‌లను మూసివేయగా, అనేక మెడికల్ స్టోర్లు కూడా షట్టర్లు దించాయి. సాధారణంగా రద్దీగా ఉండే కొన్ని క్లినిక్‌లు, మెడికల్ షాపులు తనిఖీల సమయంలో పూర్తిగా మూతపడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.ఆకస్మిక తనిఖీల ఉద్దేశం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని నిర్ధారించడమే అయినప్పటికీ, సమాచారం ముందుగానే లీక్ కావడంతో తనిఖీల ప్రభావం కొంత మేర తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, అక్రమ వైద్య సేవలు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మెడికల్ దుకాణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలి



అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలని.. విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు పరిశుభ్రతపై ఎమ్మెల్యే, ఎంపీ అధికారులు అవగాహన కల్పించారు. భోజనంకి ముందు, తర్వాత చేతులు బాగా కడగాలని.. ప్రతి రోజు స్నానం చేయాలన్నారు. మీ ఇంట్లో కానీ, పాఠశాలలో కానీ చెత్తను బుట్టల్లో మాత్రమే వేయరాదని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మీ ఇంటి వద్ద, పాఠశాలలో మొక్కలను సంరక్షించాలని.. పరిశుభ్రతపై ఇంట్లో తల్లిదండ్రులకు కూడా మీరు చెప్పాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యార్థులతో స్వర్ణాంధ్ర – స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ఎస్ఈ, ఇంచార్జ్ కమిషనర్ రాజశేఖర్, ఎంహెచ్ ఓ రాజారవీంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పి ఎల్ ఎన్ మూర్తి, బెస్త పవన్ కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు పుల్లన్న, సాకే లక్ష్మీనరసింహ, మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, కదిరప్ప, గోపాల్ గౌడ్, వన్నూరప్ప, దాడి రమేష్, సికిందర్, మనోహర్ నాయుడు, బిల్డర్ రాము, వంశీ, డిష్ నాగరాజు, యమున, జైనుభి, సుజాతమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థలో ఫైల్స్ ఎక్కడ పెండింగ్ లో ఉండకూడదు



అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య : నగరపాలక సంస్థలో పన్నుల బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆదాయం పెరిగే విధంగా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మున్సిపల్ వాజును ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఎస్ ఈ, టౌన్ ప్లానింగ్ అధికారితోపాటు ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. నగర పాలక సంస్థల సిబ్బంది పనితీరు, హాజరు శాతం, పెండింగ్ లో ఉన్న ఫైళ్ల గురించి ఆరా తీశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, దుకాణాల లైసెన్స్ ఫీజుల వసూళ్ల గురించి ఆరా తీశారు. దీర్ఘకాలిక బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైల్స్ ఎక్కడ పెండింగ్లో ఉండకూడదని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పోర్టల్ ద్వారా వచ్చే అర్జీలను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి : సీపీఐ




అనంతపురం, ఆగస్టు 22 అనంత సూర్య :హారాయలసీమ ప్రాంత ప్రజల న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్‌హా డిమాండ్ చేశారు . శనివారం జిల్లా సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కూడా టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు కర్నూల్ లో బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సర్క్యూట్ బెంచ్‌లు, మొబైల్ కోర్టులు వంటి తాత్కాలిక విధానాలు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేవని అయన పేర్కొన్నారు.రాయలసీమకు న్యాయ పరిపాలనలో సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. రాయలసీమ ప్రజలకు న్యాయం అందుబాటులోకి రావాలంటే కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.. కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటైతే రాయలసీమలోని ప్రజలు ప్రతి న్యాయపరమైన అంశం కోసం అమరావతి వరకు వెళ్లాల్సిన అవసరం ఉ ండదని ఆయన తెలిపారు . దీనివల్ల ప్రజలకు ప్రయాణ భారం, సమయం, ఆర్థిక వ్యయం తగ్గడంతో పాటు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. శాశ్వత హైకోర్టు బెంచ్ కోసం రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు చేపడుతున్న విధుల బహిష్కరణ, ఆందోళనలకు సీపీఐ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. న్యాయవాదుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జగదీష్ కోరారు. ప్రభుత్వం స్పందించకుండా ఆలస్యం చేస్తే ప్రజలు, న్యాయవాదులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. రాయలసీమకు న్యాయపరమైన సమాన అవకాశాలు కల్పించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామనిహాజగదీష్ స్పష్టం చేశారు.హాఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, పద్మావతి, రమణ, రాజేష్ గౌడ్, కృష్ణుడు ధనుంజయ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం



అనంతపురం, ఆగస్టు 22: ( అనంత సూర్య): అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శాఖ ద్వారా ప్రజల ప్రాణ రక్షణ ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనంతపురం ప్రధాన కేంద్రంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే జిల్లావ్యాప్తంగా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుగురించి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాత్రికేయ బృందంతో ప్రెస్ మీట్ నిర్వహించి అగ్నిమాపక శాఖ పని తీరుపై పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖను అన్ని విధాల బలోపేతం చేయడానికి అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రం సుమారు రూ .2. 25 కోట్ల వ్యయంతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇప్పటికే 6 దాకా భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో 36 అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో సుమారు రూ .33 కోట్లతో 65 వాహనాలు రెండవ దశలో 58 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252. 86 కోట్లతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో 25 అధునాతనఅగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా గ్రామీణ ,అటవీ ప్రాంతాల కోసం వీటి సేవలు వినియోగించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్ వద్ద సుమారు రూ. 40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 నూతన ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. అగ్ని ప్రమాదంలో ప్రాణంతో పాటు ఆస్తిపరంగా కూడా నష్టం జరగకుండా నివారించేందుకు జాతీయ ప్రయోజనాలకు మరియు రక్షణకు ఉపయోగపడే పనిలో తమ శాఖ అధికారులు సిబ్బంది విధులు నిర్వర్తించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో అగ్నిమాపక చర్యల్లో భాగంగా ఎంతో ప్రయోగాత్మకంగా అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అలాగే అగ్ని ప్రమాదాలు, ప్రకృతి సహజమైన సంఘటనలు భూకంపాలు, తుఫాను, ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులలో ఎక్కువగా ఫైర్ మరియు కిచెన్,ఎలక్ట్రికల్ ప్రమాద సంఘటనలు లాంటివి వచ్చినప్పుడు ప్రజలు, విద్యార్థులు ,రైతులు, ఉద్యోగులు తదితర సమూహాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తమ శాఖ ద్వారా విస్తృతంగా అగ్ని ప్రమాదాల నివారణ రక్షణ చర్యలకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అనంతపురము జిల్లాకు అగ్నిమాపక సేవల సిబ్బందికి సంబంధించి వివిధ స్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం జరుగు తుందన్నారు. జిల్లాలోని కళ్యాణ్ దుర్గం లో ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా నిర్వహించబడుతున్న ప్రాంతంలో అదనంగా నూతనంగా 60 సెంట్ల స్థలంలో ఫైర్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం 16వ ఆర్థిక సంఘం కింద రూ . 2.25 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే గుత్తి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో 0.50 ఎకరాల భూమిని గూటి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సమకూర్చడం జరిగిందని, పూర్వ అనంతపురం జిల్లాలోని అగ్నిమాపక సేవల సిబ్బందికి పంపిణీ చేయడానికి ఆపిల్ ఇండస్ట్రీ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పిఎస్ఆర్ కార్యక్రమం కింద ₹240 ప్రతినిధించే జాకెట్ల ను ప్రజల సేవార్థం అగ్నిమాపణ శాఖకు అందించడం జరిగిందన్నారు. అలాగే సాగర్ సిమెంట్స్ తాడిపత్రి సంస్థ ద్వారా 50 డెలివరీ హోసులు అదనంగా ఆర్జాస్ స్టీల్ మరియు అల్ట్రాటెక్ సిమెంట్స్ తాడిపత్రి సంస్థల నుండి సిఎస్ఆర్ కార్యక్రమం కింద 100 డెలివరీ హోసులు త్వరలో అందనున్నట్లు పేర్కొన్నారు. అస్ట్రో బేస్ స్పేస్ టెక్నాలజీస్ కళ్యాణ్ దుర్గం మరియు కేఎన్ఆర్ కాంట్రాక్టర్స్ సంస్థల ద్వారా సిఎస్సార్ కింద 50 మెటల్ సింగల్ కాట్లు మరియు పరుపులు అందించడం జరిగిందని అదనంగా ఎస్ఐఎంఎస్ అనంతపురం నుండి సిఎస్ఆర్ కార్యక్రమం కింద 50 మెటల్ సింగల్ కార్డులో మరియు పరుపులు త్వరలో అందరూ ఉన్నట్లు తెలిపారు. సింగనమల రాప్తాడు గుత్తి ప్రాంతాలలో నూతన ఫైర్ స్టేషన్ లో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. అలాగే అగ్నిమాపక శాఖలో 35 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పాత వాహనాల స్థానాల్లో మార్పిడి చేసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలను సమకూర్చామని తెలిపారు. డయల్ 112 నెంబర్ కు ఫైర్ పోలీసు అంబులెన్స్ సౌకర్యాలను అనుసంధానం చేస్తున్నామని స్పష్టం చేశారు. తద్వారా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే చర్యలు తీసుకునేందుకు గ్రామ మండల స్థాయిలో విస్తృత సేవలు ఇతర ఏర్పాట్లు సులభతరం అవుతాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వనరులు కార్యకలాపాలు అవసరాలు మరియు ప్రగతి గురించి వివరిస్తూ అనంతపురం జిల్లా నందు ఫైర్ టెండర్లు 8 కాగా ప్రత్యేక వాహనాలు 7 ఇందులో 1 వాటర్ బౌజర్, 2 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, 2 మిస్ట్ జీపులు02 మి స్ట్ బుల్లెట్లు, ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 49 అవగాహన కార్యక్రమాలు 192 మాక్ డ్రిల్స్ నిర్వహించినారనీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు భవనాలు, పరిశ్రమల్లో కూడా అగ్ని ప్రమాదాల నివారణ చర్యల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, సుమారు 1000 కి పైగా ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలను ఆర్టీసీ మరియు రోడ్డు ట్రాన్స్పోర్ట్ శాఖ ల అధికారుల సహకారాల తోతనిఖీ చేసి అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గతం కంటే మిన్నగా అగ్నిమాపక శాఖ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్నదని ప్రాణ ఆస్తి నష్టాలను కాపాడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పునస్కారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డెమో ద్వారా అవగాహన కల్పించి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ఉద్యోగులకు మెడల్స్ ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అద్దేపల్లి కళాశాలలో బాలికల వెయిటింగ్ హాల్ మరియు పలు అభివృద్ధి పనులను - ప్రారంభించిన మంత్రి డాక్టర్ నిమ్మల



పాలకొల్లు, ఆగస్టు 22 ( అనంత సూర్య): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి స్వయంప్రతిపత్తి ప్రభుత్వ కళాశాలలో శనివారం పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. కళాశాలలో రూ.34 లక్షల నిధులతో నిర్మించిన బాలికల వెయిటింగ్ హాల్ తో పాటు ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమాణిక్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా బాలికలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కళాశాలలో వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు.కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమాణిక్యం మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సి పి డి సి సభ్యులు డాక్టర్ ఎస్వీ రంగారావు,వైస్ ప్రిన్సిపల్ టీ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం రామకృష్ణ, డాక్టర్ వి డి వి విజయలక్ష్మి, సూపరిండెంట్ బి కనకలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న బిజెపి నాయకులు



హిందూపురం, ఆగస్టు 22:( అనంత సూర్య ): హిందూపురం మున్సిపాలిటీ 11వ వార్డు మాజీ కౌన్సిలర్ బిజెపి పట్టణ అధ్యక్షురాలు అంజలి రమేష్ రెడ్డి అభ్యర్థన మేరకు 11వ వార్డు నందు గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందమూరి బాలకృష్ణ ప్రతినిధి సురేంద్ర మరియు వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ , హిందూపురం మున్సిపల్ మాజీ చైర్మన్ డి ఈ రమేష్ , టౌన్ ప్రెసిడెంట్ మద్దిపట్ల వెంకటేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు రమేష్ రెడ్డి మాట్లాడుతూ హిందూపురం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండే మన ప్రియతమ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గారు మరియు ఎమ్మెల్యే కార్యాలయం అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం కోసం ఆఫీస్ తరఫున మోడల్ కాలనీ నుండి పులమితి రోడ్డుకు వెళ్లే ప్రధాన లింక్ రోడ్డు అభివృద్ధి కొరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసినందుకు 11వ వార్డు ప్రజల తరఫున నందమూరి బాలకృష్ణ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చంద్రశేఖర్,నవీన్,రాజు, శ్రీనివాసులు, రవి,చంద్రాయుడు, పాపన్న, మురళి, మజీద్, రామాంజనేయులు, గంగాధర్,నగేష్, అయూబ్, అరుణమ్మ, సరస్వతమ్మ,గంగ రత్నమ్మ, బాబు,నాగేంద్ర,డాలేశ్వర్, శ్రీనివాసులు, పురుషోత్తం,శివప్ప,నారాయణ, రమణారెడ్డి, వినయ్ మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ - ఏ శ్యాంప్రసాద్



ధర్మవరం,ఆగస్టు 22 :( అనంత సూర్య): జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా.... శనివారం ధర్మవరం పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య,ధర్మవరం తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులోకి ఎరువులు సహకార బ్యాంకు ఆధ్వర్యంలో విక్రయ కేంద్రం



ఉరవకొండ : ఆగస్టు 22 (అనంత సూర్య): రైతులకు అవసరమైన ఎరవులను అందుబాటులోకి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ ప్యారం కేశవానంద అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసుల సహకారంతో ఉరవకొండ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్యారం కేశవానంద మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా, అందుబాటు ధరల్లో ఎరువులు లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులకు నేరుగా అవసరమైన ఎరువులు అందించాలనే ఉద్దేశంతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విక్రయ కేంద్రంలో 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350కు, 50 కిలోల యూరియా బస్తా రూ.266కు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సహకార బ్యాంకు ద్వారా ఎరువులు పొందాలని కోరారు. రైతులకు ఎరువులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల రైతుల్లో సానుకూల స్పందన ఉందన్నారు. ముఖ్యంగా మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు డైరెక్టర్లు నాగేంద్రప్ప, నాగ ప్రమీల, సహకార బ్యాంకు కార్యదర్శి మహమ్మద్ గౌస్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజనేయులు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, సుంకన్న, పెద్దన్న, గోవిందు, సహకార బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలి విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన



పెనుకొండ, ఆగస్టు 20:( అనంత సూర్య) : మండల కేంద్రంలోని శిరిడి సాయి దేవాలయ ప్రాంగణంలో గురువారం నుండి మరో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. శంకర నేత్రాలయ మీసు పుట్టపర్తి కి చెందిన రమేష్ మాతురు, వారి సతీమణి సుజాత మాతురు సహకారంతో, స్వర్గీయ శ్రీ లాలసింగ్ రామా నాయక్ జ్ఞాపకార్థం సోమందేపల్లి మండలంలో ఉచిత కంటి పరీక్ష, చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి చూపు పరీక్షలు, కంటి సంబంధిత సమస్యల కు అవసరమైన వైద్య సేవలు సలహాలు అందించారు. అవసరమైన వారికి కంటి వైద్య పరీక్షల అనంతరం తదుపరి చికిత్సకు సంబంధించిన విషయాలు వారికి అందజేయబడతాయి. కంటి ఆపరేషన్ల అవసరం ఉన్న వారికి ప్రత్యేక వాహన సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి 24-08-2026 నుండి 28-08-2026 వరకు అవసరమైన సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారిలో లాల్ సింగ్ బాపుజీనాయక్ ఓఎన్జిసి, లాల్ సింగ్ రాంప్రసాద్ నాయక్ సివిల్ ఇంజనీర్ ఇరిగేషన్ శాఖ, లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ ప్రిన్సిపల్ సెషన్స్ అండ్ డిస్ట్రిక్ట్ జడ్జి వికారాబాద్ జిల్లా, శంకర నేత్రాలయ కంటి వైద్య నిపుణులు చెన్నై వారు ఉన్నారు.

# స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛ ఆంధ్ర




అనంత వైద్యం ఆగస్టు 22 (అనంత సూర్య): స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించే దిశగా స్వచ్ఛ ఆంధ్రను నిర్మించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఆవరణ అంతా సిబ్బంది అధికారులు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వర్ణాంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ స్వచ్ఛత ద్వారా 90% అంటు రోగాలు నిర్మూలించవచ్చని తద్వారా ఆరోగ్య సాధన, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి గిరిజ మనోహర్ రావు, మలేరియా అధికారి మనోజ్, ఆరోగ్య ట్రస్ట్ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, స్వచ్ఛంద కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, మాస్ మీడియా అధికారి, నాగరాజు, డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ రఫీ, సూపర్డెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405